క్లుప్తంగా

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని కేంద్ర ప్రభుత్వం వృత్తి నైపుణ్యత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు జన శిక్షణ సంస్థ డైరెక్టర్ శ్యామల తెలిపారు. గురువారం ఆమె ఇచ్చోడలో మాట్లాడారు. మండల కేంద్రంలో మూడు నెలల పాటు కంప్యూటర్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల చివరి వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 94919 30330 సంప్రదించాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

జైనథ్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గజానన్ రావ్ తెలిపారు. ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డిలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు.

కంటివెలుగు సద్వినియోగం చేసుకోవాలి



కంటివెలుగును శిబిరం ప్రారంభిస్తున్న ఎంపీపీ

నార్నూర్: ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కనక మోతుబాయి అన్నారు. గురువారం మండలంలోని ఖైర్‌డట్వా గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. కంటి సమస్యలు ఉన్న వారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కనక సేవంతబాయి ప్రభాకర్, హెచ్ఈ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా మహేందర్ కుమార్



మహేందర్ కుమార్

బేల: బేల మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా సూపరింటెండెంట్ నేరల్వార్ మహేందర్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో భగత్ రవీందర్ ఈనెల 15న గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో మహేందర్ కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఠాక్రే గంభీర్, సతీష్ పవార్, గోడం సునీల్, ప్రమోద్ రెడ్డి, ఇంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాడ్గే మహరాజ్ జయంతి



విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బేల: మండల కేంద్రంలోని మార్కెట్ కూడలిలో గురువారం రజక సంఘం ఆధ్వర్యంలో సంత్ గాడ్గే మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సప గాడ్గే మహరాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కల దత్తు, ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్, ఠాక్రే గంభీర్, జక్కుల మధుకర్, సతీష్‌పవార్, గోడం సునీల్, తాన్‌బా, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనానికి స్థలం కేటాయింపు

ఖానాపూర్: పట్టణంలోని కుమరం భీం చౌరస్తాలో అంబేద్కర్ సంఘ భవన నిర్మాణం కోసం రెండెకరాల స్థలం కేటాయించినట్లు ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మున్సిపల్ చైర్మన్ రాజేందర్, వైస్ చైర్మన్ ఖలీల్, ఎంపీపీ మోహిద్, రాజగంగన్న, సంతోష్, రాజశేఖర్, గంగాధర్ ఉన్నారు.

వాహనపత్రాలు వెంట ఉంచుకోవాలి

ఖానాపూర్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని ఖానాపూర్ సీఐ నారాయణ నాయక్ అన్నారు. పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఆటోడ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలను నిలపడం, మైనర్లకు వాహనాలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై ఆర్.శంకర్, ఆటోడ్రైవర్లు ఉన్నారు.

జాతరకు సిరిచెల్మ ముస్తాబు

- నేటి నుంచి వారం రోజుల పాటు నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన గ్రామస్తులు



విద్యుత్ దీపాల వెలుగుల్లో సిరిచెల్మ మల్లన్న ఆలయం

ఇచ్చోడ: కాకతీయుల కాలంలో నిర్మించిన సిరిచెల్మ మల్లన్న ఆలయం జాతరకు ముస్తాబైంది. వారం రోజుల నుంచి జాతరకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం ఆలయ గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరను ప్రారంభిస్తారు. వారం రోజుల పాటు జాతర సాగనుంది. జాతర ముగింపుకు ఒక్కరోజు మార్చి 2న గురువారం తెల్లవారు జామున ఆలయం ఆవరణలో అగ్ని గుండం ఏర్పాటు చేస్తారు. అందులో నుంచి భక్తులు నడుచుకుంటూ.. వెళ్లి మొక్కులు తీర్చుకుంటారు. జాతర ముగింపు రోజు ఉదయం తెల్లవారు జామున వేంకటేశ్వర స్వామి, మల్లన్న రథాలతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహిస్తారు. దీంతో జాతర ముగుస్తుంది. జిల్లా నలుమూలాల నుంచి కాకుండా మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

ఆలయంలో అద్భుత అపురూపాలు..

ఆదిలాబాద్ జిల్లాలో అతిపురాతన శివాలయంలో సిరిచెల్మ మల్లన్న ఆలయం ఒక్కటి. ఈఆలయంలో అద్భుతమైన దృశ్యాలు భక్తులను ఆకట్టుకుంటాయి. మండల కేంద్రం నుంచి 18 కిలో మీటర్ల దూరంలో అటవీ ప్రాంతం ఉన్న ఆలయం తూర్పు ముఖ ద్వారంతో ఉంటుంది. సూర్యుడు ఉదయించగానే సూర్యకిరణాలు నేరుగా గర్భగుడిలోని శివలింగంపై పడటంతో శివలింగం దివ్య కాంతులతో వెలగడం ఈ ఆలయ ప్రత్యేకతలో ఒక్కటి. చెరువు మధ్యలో ఉన్న ఆలయం కాకతీయుల కాలంలో నిర్మించినట్లు పెద్దలు చెబుతుంటారు. శివాలయంలో అంజనేయుడు, శని దేవుడు, మహిషాసురవర్దిని, ఏడు పడగల నాగపాము విగ్రహాలు ఆకట్టుకుంటాయి. శ్రీనివాసుని ప్రతిమ ఆలయంలోని కుడి పక్కన ఉంటుంది. ఆ విగ్రహం చేతిలో నాణేలు పెట్టి భక్తులు కోరికలు కోరుతుంటారు. నాణేం అతుక్కుంటే కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. మరోచోట ఆరుముఖాలు కలిగిన కార్తికేయుడి విగ్రహం ఉంటుంది. శివపార్వతులు అష్టలక్ష్మీ విగ్రహాలు కూడా దర్శనమిస్తాయి. నేరేడిగొండ మండలంలోని కుంటాల జలపాతం వద్ద గుహలో ఉన్న శివలింగానికి సొరంగ మార్గం ఉన్నట్లు పలువురు చెబుతుంటారు. అప్పట్లో కాకతీయులు పాలించే కాలంలో సిరిచెల్మ ప్రాంతం నుంచి సొరంగ మార్గం ద్వారా కుంటా శివలింగాన్ని దర్శించు కోవడానికి వెళ్లేవారని ప్రచుర్యంలో ఉంది. మహా శివరాత్రి, ఏకదశి, సోమ, శని వారాల్లో ఇక్కడి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహిస్తుంటారు. చుట్టూ పక్కల మండలాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. జాతర సందర్భంగా మండల కేంద్రం నుంచి ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ వాహనాలు నడుపుతుంటారు.

టీడీఎస్ రద్దు చేయాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న కమీషన్ ఏజెంట్లు

ఆదిలాబాద్‌టౌన్: తమకు టీడీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కాటన్ కమీషన్ ఏజెంట్లు గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాటన్ కమీషన్ ఏజెంట్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. రూ. 50 లక్షల టర్నోవర్ దాటిన వారందరికీ 0.01శాతం టీడీఎస్ విధిస్తుండటంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. 194 సెక్షన్ నుంచి కమీషన్ ఏజెంట్లను మినహాయించాలన్నారు. అనంతరం మార్కెట్ సెక్రటరీ వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మల్లేశ్

కైలాస్‌నగర్: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర బీజేపీ ప్రభుత్వ మోసపూరిత వైఖరికి నిరసనగా ఈనెల 27న చేపట్టే మాదిగల సంగ్రామ పాదయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేశ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక తనీషా గార్డెన్‌లో నిర్వహించిన సంఘ సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రాం విగ్రహం నుంచి హైదరాబాద్ మేడ్చల్ వరకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ ఆధ్వర్యంలో యాత్ర సాగుతుందన్నారు. జిల్లాలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు బడుగు గంగయ్య, బరుకుంటి సుభాష్, గైక్వాడ్ సూర్యకాంత్, చిట్టి రవి, ఉప్పులేటి శ్రీను పాల్గొన్నారు.

పల్లెలకు రాని ‘పల్లెవెలుగు’



బేల నుంచి సైద్‌పూర్‌కు ఆటోలో ప్రమాదకరంగా వెళ్తున్న ప్రయాణికులు

- బేల నుంచి సైద్‌పూర్‌కు ప్రైవేటు వాహనాలే దిక్కు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

బేల: గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం ఉన్నా.. బస్సు సౌకర్యం కల్పించడం లేదు. మండల కేంద్రం బేల నుంచి సైద్‌పూర్ మార్గంలో బస్సులు నడపడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థులు, ప్రయాణికుల రాకపోకల కోసం అవస్థలు పడుతున్నారు. బస్సు సౌకర్యం కోసం గతంలో ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో అధికారులకు పలుమార్లు విన్నవించినా.. ఫలితం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బేల నుంచి సైద్‌పూర్ వైపు పోహర్, ఏకోరి, మశాల(బి), మశాల(కె), బాది, సైద్‌పూర్, సాంగ్వి(జి), తోయగూడ, డౌన, ఖార, దుబ్బగూడ(ఎస్) గ్రామాలు ఉన్నాయి. 11 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తంగా 25 వరకు గ్రామాలు ఉన్నాయి. ప్రజలు మండల కేంద్రానికి ప్రభుత్వ కార్యాలయాలు, మీ సేవా కేంద్రంలో పనుల కోసం వస్తుంటారు. అలాగే జైనథ్ మండలంలోని జామిని, మారుగూడ గ్రామ పంచాయతీల పరిధిలోని ఐదు గ్రామాల ప్రజలు సైతం ఈరోడ్డు గుండా బేల మండల కేంద్రానికి నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు.

పరిమితికి మించి ప్రయాణం..

మండలంలోని 25 గ్రామాల నుంచి విద్యార్థులు, ప్రయాణికులు మండల కేంద్రానికి రాకపోకల కోసం ఆటోలు, జీపులు, ప్రైవేటు వాహనాలే దిక్కుగా మారాయి. సకాలంలో వాహనాలు ఉండకపోవడంతో పాటు ఆర్థికంగా భారమవుతుందని వాపోతున్నారు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు స్పందించి, బస్సు సర్వీసు సౌకర్యం కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బస్సులు నడపాలి



మా గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. ఏళ్ల నుంచి రాకపోకల కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. గతంలో కాలినడకన వెళ్లే వాళ్లం. ఇప్పుడు ప్రైవేటు వాహనాల్లో ప్రమాదకరంగా వెళ్లాల్సి వస్తోంది. ఆర్టీసీ అధికారులు బేల నుంచి సైద్‌పూర్ మార్గంలో ఆర్టీసీ బస్సులు నడపాలి.

–పోతు పటేల్, మశాల(కె)

ఆటోల్లో వెళ్తున్నాం



మండల కేంద్రం నుంచి ఏజెన్సీ ప్రాంతంలోని సైద్‌పూర్ వైపు రోడ్డు సౌకర్యం ఉన్నది. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. ప్రైవేట్ వాహనాలు దిక్కుగా మారాయి. ఇవేమి లేకపోతే ఆర్టీసీ బస్సుతో జిల్లా కేంద్రానికి వెళ్లాలి. అక్కడి నుంచి మండల కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది.

– మడావి గోవింద్‌రావు

ఎమ్మెల్యేలకు ఆహ్వానం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్‌అర్బన్: ఇచ్చోడ మండల కేంద్రంలో ఈనెల 26న అన్నాభావు సాతే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని బోథ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, జోగు రామన్నను అన్నాభావు సాతే ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. పట్టణంలోని వారి నివాసాలకు వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గైక్వాడ్ గణేష్, కాంబ్లే ఉద్ధవ్, సూర్యకాంత్, డికే నాందేవ్, దుబ్బాక సుభాష్, జన్నారపు సాహెబ్‌రావ్, సిరిసిల్ల భూమయ్య, విష్ణు, కళ్లెపెల్లి రాజు, ఆశన్న, పోనకంటి ఆశన్న, రాంకిషన్ పాల్గొన్నారు.

పెళ్లి రోజే షాదీ ముబారక్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

కైలాస్‌నగర్: నిరుపేద ఆడబిడ్డల తల్లిదండ్రులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం వరం లాంటిదని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని అయేషా మస్జిద్‌లో గురువారం జరిగిన ఓవివాహ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పెళ్లి రోజునే మంజూరైన షాదీముబారక్ చెక్కును అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కోఆప్షన్ సభ్యులు ఎజాజ్ పాల్గొన్నారు.

‘హామీలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ విఫలం’



రేవోజీపేటలో మాట్లాడుతున్న మాజీఎంపీ రమేశ్

దస్తురాబాద్: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని రేవోజీపేట గ్రామంలో ప్రజాగోస–బీజేపీ భరోసాలో భాగంగా స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులు నాసికరంగా చేపట్టి ఎమ్మెల్యే అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. బీజేపీ నాయకులు హరినాయక్, మండలాధ్యక్షుడు లక్ష్మణ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి రఘు, రాజేశం, వెంకటరమణ, వెంకన్న, గంగాధర్, తిరుపతి, స్వామి, రాజేందర్ పాల్గొన్నారు.

కన్కపూర్‌లో ప్రజాగోస–బీజేపీ భరోసా

లోకేశ్వరం: రాష్ట్రంలో కేసీఆర్ పాలన నిజాం తుగ్లక్ పాలనను గుర్తు చేస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దడిగే భోజన్న అన్నారు. గురువారం మండలంలోని కన్కపూర్ గ్రామంలో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.

నట్టల నివారణ మందు వేయించాలి



నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యాధికారి పర్వేజ్ అహ్మద్

బజార్‌హత్నూర్: మండలంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మార్చి 1 వరకు నిర్వహిస్తున్న నట్టల నివారణ మందును మేకలు, గొర్రెల పెంపకందారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి పర్వేజ్ అహ్మద్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నట్టల నివారణ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చట్ల విలాస్, మాజీ సర్పంచ్ పరచ సాయన్న, తాండ్ర పోతన్న, పరమేశ్వర్, తొట్ల శంకర్ యాదవ్, మారుతి పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. వంతెన నిర్మించేదెప్పుడో?



తాంసి: మండల కేంద్రానికి సమీపంలో రూ.3.20 కోట్లతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మండల కేంద్రానికి నిత్యం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కాంట్రాక్టర్ త్వరితగతిన పనులు పూర్తి చేసి, రాకపోకలు సాగించే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: రాజేష్ కుమార్, పంచాయతీరాజ్ ఏఈ, ఫోన్: 94935 55560

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఇంద్రవెల్లి: మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం సెర్ప్, నాబార్డ్ ద్వారా ట్రాక్టర్‌తో పాటు యంత్రాలు మంజూరు చేసిందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐకేపీ కార్యాలయాలకు అందించిన ట్రాక్టర్, యంత్రాలతో వ్యవసాయ పనులు చేయించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. వీవోఏల వేతనలు పెంచాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ముందుగా మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అజంద్, గోపాబాయి, సుఫియన్, ఐకేపీ ఏపీఎం రామారావ్, సీసీలు శ్రీరాం, మోతిరాం పాల్గొన్నారు.

సప్తాహంలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కుమ్మరితండాలో నిర్వహించిన సప్తాహంలో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా షెడ్ నిర్మాణం కోసం రూ. 5 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గౌట్టిపటార్‌లో నూతన బీటీరోడ్డు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



శ్యాంనాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని గజిటెడ్ అధికారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అజ్మీరా శ్యాం నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్యకళాశాలలో గురువారం నిర్వహించిన సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరయ్యారు. వైద్య ఆరోగ్య శాఖకు చెందిన గజిటెడ్ అధికారులు అనిల్ కాములు, సిడాం వామన్ రావ్, బాబూలాల్, బ్రహ్మానందరెడ్డి, విజయ, శారద, కృష్ణలత, సిరాజ్, అర్షద్, భూమయ్య, వేణుగోపాల్ రెడ్డిల పాటు పలువురు అధికారుల సభ్యత్వం నమోదు చేశారు. గజిటెడ్ అధికారుల హక్కులను కాపాడేందుకు, అధికారుల సంక్షేమం కోసం టీజీవో సంఘం పాటు పడుతుందన్నారు. సమావేశంలో టీజీవో కార్యదర్శి వనజారెడ్డి, కోశాధికారి శివకుమార్ పాల్గొన్నారు.

‘ఎమ్మెల్యేది అవగాహన రాహిత్యం’



మాట్లాడుతున్న పాయల్ శరత్

ఆదిలాబాద్: ఎమ్మెల్యే జోగు రామన్న అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని బీజేపీ నాయకుడు, అడ గ్రామ సర్పంచ్ పాయల్ శరత్ విమర్శించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. జాతీయ ఉపాధి హామీ పథకం గురించి కనీసం జ్ఞానం కూడా లేదన్నారు. గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామని అనడం సమంజసం కాదన్నారు. బీజేపీ సర్పంచులు ఉన్న గ్రామంలో ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదని ఆరోపించారు. అమాయక గిరిజన సర్పంచ్‌లను మభ్యపెట్టి మాపై అట్రాసిటీ కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు తెలుసుకొని మాట్లాడాలన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు రతన్ రెడ్డి, ఉజ్వల, బీజేపీ నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, రాందాస్, రమేష్, సుభాష్ పాల్గొన్నారు.

కబడ్డీ కిట్ అందజేత

బోథ్: మండలంలోని గుట్టపక్కతండా గ్రామానికి చెందిన నిరుపేద కబడ్డీ క్రీడాకారుడు శ్రీకాంత్ ఇటీవల తెలంగాణ అసోసియేషన్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. కబడ్డీ కిట్‌ను కొనలేని పరిస్థితి ఉండడంతో ప్యూర్ సంస్థ సహకారంతో తుల సుభాష్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు తుల అరుణ్ కుమార్ రూ. 40 వేల విలువ గల కబడ్డీ కిట్‌ను సొసైటీ సభ్యుల చేత అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లో రాణించి జిల్లాకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, ఐటీడీఏ డైరెక్టర్ భూమన్న, కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ రమేష్ బత్తుల, భీంరావ్ పాటిల్, బొశెట్టి రమేష్, పోతన్న, మహేష్, అనూష్, సుధీర్, ప్రతాప్ సింగ్ చౌహాన్, శివ, రాజు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

నేటి నుంచి జేబీఎస్‌కు రాజధాని సర్వీస్

ఆదిలాబాద్: నేటి నుంచి హైదరాబాద్‌కు ప్రతీ రోజు సాయంత్రం 6 గంటలకు రాజధాని సర్వీసు ప్రారంభించనున్నట్లు ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి జేబీఎస్ వరకు వెళ్తుందన్నారు. అదేవిధంగా ఉదయం 6:30 గంటలకు జేబీఎస్ నుంచి ఆదిలాబాద్‌కు తిరుగు పయనం అవుతుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మంత్రి రాక

నేరడిగొండ: రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి శుక్రవారం నేరడిగొండ మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీపీ రాథోడ్ సజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కుంటాల జలపాతం రోడ్డుపై సవర్గావ్ గ్రామం వద్ద గల హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నేరడిగొండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.